క్లుప్తంగా

దువ్వూరు కాలువకు సాగునీరు విడుదల



సంగం: సంగం ఆనకట్టకు సోమశిల జలాలు వస్తుండడంతో దువ్వూరు కాలువకు ఇరిగేషన్ అధికారులు బుధవారం సాగు నీటిని విడుదల చేశారు. సంగంలోని బస్టాండ్ సెంటర్ సమీపంలో ఉన్న దువ్వూరు కాలువ రెగ్యులేటర్ వద్ద డీఈ పెంచలయ్య, ఏఈ వినయ్ ప్రత్యేక పూజలు నిర్వహించి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దువ్వూరు కాలువ కింద నాలుగు వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. దువ్వూరు కాలువ ఆయకట్టు రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. వారి వెంట ఇరిగేషన్ సిబ్బంది, రైతులు ఉన్నారు.

స్టేజ్ నిర్మాణానికి భూమిపూజ



సోమశిల: అనంతసాగరంలోని టీజీఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, రాష్ట్ర వైఎస్సార్‌టీఎఫ్ అధ్యక్షుడు మెట్టుకూరు సుబ్బారెడ్డి తన సొంత నిధులు రూ.4లక్షలతో స్టేజ్ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. తన మామ లింగంగుంట మాజీ సర్పంచ్ మాదిరెడ్డి సుబ్బారెడ్డి జ్ఞాపకార్థంగా స్టేజ్‌ను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ని ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం బట్రెడ్డి లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

మెనూను పాటించాలి



ఆత్మకూరు: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలని ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని సూచించారు. పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఉదయం విద్యార్థులు టిఫిన్ చేస్తున్న సమయంలో ఆర్డీఓ సందర్శించారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందజేస్తున్నారా..లేదా అని విద్యార్థులను ఆరాతీశారు. అనంతరం మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనానికి సిద్ధం చేస్తున్న ఆహార పదార్థాలను వంటగదిలోకి వెళ్లి పరిశీలించారు. ఆమె వెంట గురుకులం ప్రిన్సిపల్ కామేశ్వరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి వరి ఎండుముఖం

ఉదయగిరి: మండలంలోని గుడినరవలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో సాగునీరందక వరి పంట ఎండిపోతోంది. పదిహేను రోజుల క్రితం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. అప్పట్నుంచి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని రైతులు వాపోయారు. వరిపైరు ఎండిపోతోందని, పెట్టుబడులు నష్టపోతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

12 నుంచి జీవాల పెంపకంపై శిక్షణ

వరికుంటపాడు: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నంద్యాలలో జీవాల పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నట్లు మండల పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ బుధవారం తెలిపారు. బస్సు, వసతి, భోజన సౌకర్యాలను ఉచితంగా కల్పిస్తున్నట్లు చెప్పారు. మండలం నుంచి ఇద్దరు లేదా ముగ్గురికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ పూర్తిపేరు, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్, చిరునామా తదితర వివరాలతో నమోదు చేసుకోవాలని కోరారు.

పామూరుకు బస్సు సౌకర్యం

వరికుంటపాడు : మండలంలోని యర్రంరెడ్డిపల్లి , గొల్లపల్లి వయా ఇరువురు మీదుగా పామూరుకు ఉదయగిరి ఆర్టీసీ డిపో అధికారులు బస్సు సౌకర్యాన్ని కల్పించారు. గతంలో ఈ మార్గంలో బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ కలెక్షన్లు రావడం లేదనే నెపంతో సర్వీసును రద్దు చేశారు. అప్పట్నుంచి పది గ్రామాలకు చెందిన విద్యార్థులు, ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించి పామూరుకు రాకపోకలు సాగిస్తుండేవారు. ఇటీవల ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ప్రజలు బస్సు సమస్యను విన్నవించారు. ఆయన చొరవతో డిపో అధికారులు బస్ సౌకర్యాన్ని ప్రారంభించారు.

ఖాళీ స్థలాలు..అపరిశుభ్రతకు నిలయాలు

పట్టణంలోని ఖాళీ స్థలాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. ఆత్మకూరు మున్సిపాలిటీగా మారిన తరువాత స్థలాలకు డిమాండ్ ఏర్పడడంతో చుట్టుపక్కల ప్రాంతాల వారు కొనుగోలు చేశారు. వాటిలో నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా వదిలేయడంతో కంపచెట్లు దట్టంగా పెరిగిపోయాయి. చెత్త పేరుకుపోయి..మురుగు నిల్వ చేరి పాములు, దోమలకు ఆవాసాలుగా మారాయి. యజమానులకు నోటీసులు ఇచ్చి ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు హెచ్చరికలకే పరిమితమవడంతో చుట్టుపక్కల నివాసాల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ప్రియదర్శినినగర్‌లో ఖాళీ స్థలంలో మురుగు, చెత్త నిల్వ

ఆత్మకూరు: గతంలో ఆత్మకూరు మేజర్ పంచాయతీగా ఉండేది. 2012లో ఆత్మకూరు చుట్టుపక్కల ఉన్న ఐదు గ్రామాలు, రెండు మజరా గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా మార్చారు. పట్టణ జనాభా 34వేలు కాగా, 23 వార్డులతో మున్సిపాలిటీగా ఏర్పాటైన వెంటనే స్థలాలకు డిమాండ్ పెరిగింది. దీంతో రియల్టర్లు వెంచర్లు వేసి పొలాలను ఇళ్ల స్థలాలుగా మార్చి విక్రయాలు చేశారు. అయితే ప్లాట్లు కొనుగోలు చేసిన కొందరు ఇళ్లను నిర్మించుకోగా, మరికొందరు భవిష్యత్‌లో అధిక ధరలకు అమ్ముకోవచ్చునని ఖాళీగా ఉంచేశారు. పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి ఎక్స్‌టెన్షన్ ఏరియా, ఆర్టీసీ డిపో ఎదురు వీధి, జేఆర్‌పేట శివారు, రవితేజ కళ్యాణ మండపం సమీపంలో, నెల్లూరుపాళెం, పేరారెడ్డిపల్లి, తదితర ప్రాంతాల్లో ఇళ్ల మధ్యన ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి.

ఇదీ సమస్య

ఏళ్ల తరబడి ఖాళీగా స్థలాలను వదిలేయడంతో కంప, పిచ్చిచెట్లు పెరిగిపోయి చిట్టడవులను తలపిస్తున్నాయి. వ్యర్థాలు పేరుకుపోయి..వర్షాకాలంలో నీరు నిలిచి పాములు, దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. కొన్నిచోట్ల ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డుల్లా తయారయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచాల్సిన వాటి యజమానులు పట్టించుకోకపోతుండడంతో సమీపంలో నివాసం ఉంటున్న వారు రోగాల బారిన పడుతున్నారు.

హెచ్చరికలకే పరిమితం

మున్సిపల్ చట్టప్రకారం పట్టణాల్లో ఖాళీ స్థలాలను ఏడాదికిపైగా అలాగే వదిలేయడం వల్ల సమీప గృహాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే మున్సిపల్ అధికారులు వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలి. ఖాళీ స్థలాలకు 0.5 శాతం పన్ను విధించి వసూలు చేయాలి. అలా చెల్లించకపోతే ఆ తరువాత అధిక జరిమానా విధించడం చేయాలి. కానీ ఆ దిశగా మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. గతంలో కొందరు మున్సిపల్ కమిషనర్లు ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి సరిపెట్టుకున్నారు. దీంతో ఖాళీ స్థలాల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది బదిలీలతో చర్యలు తీసుకునేందుకు ఆలస్యమవుతోందని గతంలో ఉన్న కమిషనర్ తెలిపారు. ప్రస్తుతం బదిలీలు పూర్తయి కొత్తవారు వారి స్థానాల్లో కుదురుకున్నారు. అయినా ఇప్పటి వరకు ఖాళీ స్థలాల ను పట్టించుకుని ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పరిష్కారం ఇలా..

- మున్సిపల్ పరిధిలో 727కుపైగా ఖాళీ స్థలాలు ఉన్నాయి. అయితే కేవలం వంద మందిలోపు యజమానులకు మాత్రమే నోటీసులు అందజేసినట్లు సమాచారం.
- ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచని యజమానులను కేవలం హెచ్చరించడమే కాకుండా భారీగా అపరాధ రుసుం విధించాలి.
- మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో ఖాళీ స్థలాలను శుభ్రం చేయించి వాటి యజమానుల వద్ద నగదు వసూలు చేయాలి.
- అపరాధ రుసుం చెల్లించకుంటే ఎన్‌ఓసీలకు అనుమతులు ఇవ్వకూడదు.
- కొన్ని వెంచర్లలో కన్వర్షన్ కానీ పరిస్థితుల్లో గృహాలు నిర్మించారని సమాచారం. ఈ విషయమై అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

నోటీసులు ఇస్తాం

మున్సిపల్ పరిధిలోని ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు అందజేస్తాం. ఖాళీ స్థలాల వద్ద పారిశుధ్యం మెరుగుపడేలా చర్యలు చేపడతామన్నారు. మున్సిపల్ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– గంగా ప్రసాద్, మున్సిపల్ కమిషనర్



జేఆర్‌పేటలో ఖాళీ స్థలంలో నిలిచిన నీరు

భక్తిశ్రద్ధలతో నాగపంచమి

వరికుంటపాడు: నాగపంచమి పర్వదినాన్ని మండల ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు వేకువజామునే లేచి చన్నీటి స్నానాలు ఆచరించి భక్తి నాగుల పుట్టల వద్దకు వెళ్లి పాలు పోసి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి ఉపవాస దీక్షలు విరమించారు. అనంతరం సమీపంలోని శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

53 మందికి వైద్యపరీక్షలు



వరికుంటపాడు: మండలంలోని కాంచెరువు సచివాలయం పరిధిలో 104 వాహన సేవలను బుధవారం అందజేశారు. వైద్యాధికారిణి కరిష్మా 53 మందిని పరీక్షించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

మిషన్ ఇంద్ర ధనస్సు సర్వే పరిశీలన

వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడులో ఆశ కార్యకర్తలు చేపడుతున్న మిషన్ ఇంద్ర ధనస్సు సర్వేను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖరరాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు ప్రతిఇంటిని సందర్శించి వ్యాధి నిరోధక టీకాలు వేయని గర్భిణులు, చిన్నారులను గుర్తించాలని సూచించారు. ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి వారికి టీకాలు వేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

సంగం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగం పీహెచ్‌సీ వైద్యాధికారి అశోక్ సూచించారు. మండలంలోని పెరమనలో జ్వరాలు ప్రబలడంతో సంగం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది బుధవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ అశోక్ జ్వరపీడితులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటిని సందర్శించి లార్వా, ఫీవర్ సర్వేలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడిగా ఉండే ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున దోమతెరలు వాడాలన్నారు. ఎంపీహెచ్ఈఓ మల్లెం కొండయ్య, హెచ్ఈ ఆరోగ్యమేరీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలను పరిష్కరించాలని వినతి



ఏపీఎంకు వినతి పత్రం అందజేస్తున్న వీఓఏలు

సోమశిల: వీఓఏల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం మండల కార్యదర్శి చీదర్ల లక్ష్మీదేవి కోరారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు వీఓఏలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వెలుగు ఏపీఎం వెంకటరమణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారానికి దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగా తొలుత ఏపీఎంకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. తాము గ్రామాల్లో పొదుపు సభ్యులకు అనేక రకాలుగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడంలో కీలకంగానూ వ్యవహరిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల కాలపరిమితిని రద్దు చేసి వీఓఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే సంఘబంధం ఖాతాలో కాకుండా నేరుగా వీఓఏల ఖాతాల్లో నేరుగా వేతనాలు పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్ బాషా, వీఓఏల యూనియన్ నాయకులు ఎస్కే షాహిద, ఎం సౌభాగ్య, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.


ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



విలేకరులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఉదయగిరి: ప్రజాసమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కటారి అజయ్‌కుమార్ విమర్శించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరి మెట్ట ప్రాంత ప్రజలు కొన్ని దశాబ్దాలుగా సాగు, తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధి అవకాశాలు లేక యువత వలసబాట పడుతున్నా వారిని ఆదుకునే ప్రయత్నాలను ప్రభుత్వాలు చేయడం లేదన్నారు. ఉదయగిరి–బండగానిపల్లి ఘాట్‌రోడ్డు, ఉదయగిరి–నందవరం రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని ఏళ్ల తరబడి పాలకులు, అధికారులను వేడుకుంటున్నా ప్రయోజనం లేదన్నారు. ఉదయగిరి వైద్యశాలలో రోగులకు సక్రమంగా సేవలందడం లేదని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ నెల 10న ఉదయగిరి, వరికుంటపాడు, సీతారామపురం మండలాలకు సంబంధించి ప్రాంతీయ సమావేశాన్ని ఉదయగిరిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. డిసెంబరు 7,8 తేదీల్లో జిల్లా మహాసభలు ఇందుకూరుపేట, ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో రాష్ట్ర మహాసభలను నెల్లూరులో నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు హాజరై సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, తిరుపతయ్య, వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక స్నానం..కష్టాల తీరం



తుమ్మలపెంట రోడ్డు పక్కన చెత్త నిల్వ

కావలి: మండలంలోని తుమ్మలపెంట సముద్ర తీరం పర్యాటకంగా ప్రసిద్ధి చెందింది. ఏటా కార్తీకమాసంలో ఇక్కడకు సముద్రస్నానాలు ఆచరించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివస్తుంటారు. సెలవు, పర్వదినాల్లో పర్యాటకులు సైతం తరలి వచ్చి సేదతీరుతుంటారు. అయితే బీచ్ వద్ద తగిన తగిన సౌకర్యాలు లేకపోవడం..పరిసరాలు చెత్తతో అపరిశుభ్రంగా ఉండడంతో భక్తులు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. బకింగ్‌హామ్ కెనాల్ నుంచి బీచ్ వరకు సరైన రోడ్డు వసతి లేదు. బీచ్‌లో పర్యాటకుల రక్షణకు విధులు నిర్వహించాల్సిన పోలీసు, మెరైన్ సిబ్బంది జాడ కూడా కనిపించడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీచ్‌లోని చెత్తచెదారాలను తొలగించి తగిన సౌకర్యాలు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.



బీచ్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు

అవినీతి నిరోధక చట్టాలపై అవగాహన అవసరం



ప్రతిజ్ఞ చేస్తున్న బ్యాంకు సిబ్బంది

కావలి: అవినీతి నిరోధక చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని లోక్ అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి అన్నారు. పట్టణంలోని జనతాపేటలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఆవరణలో విజిలెన్స్ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలకొండారెడ్డి మాట్లాడుతూ మనదేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పురోభివృద్ధికి అవినీతి ఒక ప్రధాన అవరోధమని పేర్కొన్నారు. అవినీతి నిరోధక చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని అవినీతి రహిత సమాజం కోసం కృషి చేయాలని కోరారు. ప్రతి పౌరుడు అవినీతిని ప్రోత్సహించకుండా బాధ్యతాయుతమైన పౌరుడిగా సమాజంలో ఎదగాలన్నారు. బ్యాంక్ మేనేజర్ ఎం నరేంద్ర మాట్లాడుతూ లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని పేర్కొన్నారు. అనంతరం అవినీతి నిర్మూలనకు కృషి చేస్తామని బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు ప్రతిజ్ఞ చేశారు.

తొలి రోజు కబడీ విజేతలు వీరే..



తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

కావలి: పట్టణంలోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–19 అంతర్‌జిల్లా కబడ్డీ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తున్న ఈ పోటీల్లో తొలిరోజు విజయనగరం, నెల్లూరు మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు గెలుపొందింది. పశ్చిమగోదావరి, వైఎస్సార్ జిల్లా జట్ల మధ్య జరిగిన పోటీలో పశ్చిమగోదావరి జట్టు విజేతగా నిలిచింది. విశాఖపట్నం, చిత్తూరు జిల్లాల మధ్య జరిగిన పోటీలో చిత్తూరు జిల్లా జట్టు గెలుపొందింది. గుంటూరు, కర్నూలు జట్ల మధ్యన జరిగిన మ్యాచ్‌లో కర్నూలు జట్టు విజయం సాధించింది. ప్రకాశం, అనంతపురం జిల్లాల జట్ల నడుమ జరిగిన పోటీలో అనంతపురం జట్టు విజయదుందుభి మోగించింది. విజయనగరం, వైఎస్సార్ జిల్లా జట్ల మధ్యన జరిగిన మ్యాచ్ లో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. పశ్చిమగోదావరి, నెల్లూరు జట్ల మధ్య ఉత్కంఠభరితంగా సాగిన పోరులో నెల్లూరు జట్టు విజేతగా నిలిచింది. కృష్ణ, చిత్తూరు జట్ల నడుమ జరిగిన మ్యాచ్‌లో కృష్ణ జట్టు గెలుపొందింది. శ్రీకాకుళం, కర్నూలు జట్ల నడుమ జరిగిన పోటీలో శ్రీకాకుళం జట్టు సునాయసంగా గెలిచింది. తూర్పు గోదావరి, అనంతపురం జిల్లాల జట్ల మధ్య జరిగిన తీవ్రమైన పోటీలో తూర్పుగోదావరి జట్టు గెలుపొందింది. నెల్లూరుతో తలపడిన వైఎస్సార్ జిల్లా జట్టుపై నెల్లూరు పై చేయి సాధించింది. పశ్చిమగోదావరి, విజయనగరం నడుమ జరిగిన ఆసక్తికరమైన పోటీలో విజయనగరం జట్టు అద్భుతమైన ఆటను ప్రదర్శించి విజేతగా నిలిచింది. కృష్ణ , విశాఖపట్నం జట్ల మధ్య జరిగిన పోటీలో కృష్ణ జట్టు గెలుపొందింది. విజేతలను డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ దామిశెట్టి శ్రీనివాస నాయుడు, కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు అభినందించారు.

పాతూరు ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయాలి

కావలి: పట్టణంలోని పాతవూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేసి ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని విశ్రాంత హెచ్ఎం సీ శారద బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన ఉన్నత పాఠశాల ఎంతో మందికి ఉజ్వల భవితను అందించిందని తెలిపారు. 'కావలి తథాగతుడిగా ' పేరొందిన దొడ్ల రామచంద్రారెడ్డి కూడా ఇక్కడే హైస్కూల్ విద్యను అభ్యసించారని గుర్తుచేశారు. ఆయన ఉన్నతాశయం ఫలితంగా జవహర్ భారతి విద్యాసంస్థలు అవతరించాయని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖ సమీక్ష సమావేశంలో మండలానికో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, అందులో భాగంగా పాతూరు జెడ్పీ హైస్కూల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. పేద, బడుగు వర్గాలకు కళాశాల ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ విషయంపై కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ప్రత్యేక దృష్టి సారించి జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి



మర్రిపాడు: మినుము పంటను పరిశీలిస్తున్న అధికారులు



అనుమసముద్రంపేట: రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ రజని



సోమశిల: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీధర్‌రెడ్డి

ఆత్మకూరు(చేజర్ల): రబీ పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని పొదలకూరు ఏడీఏ శివనాయక్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చేజర్ల మండలం వావిలేరు, పాడేరు గ్రామాల్లో బుధవారం ఆయన ఏఓ శశిధర్‌తో కలిసి పర్యటించారు. పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశమై పంటల సాగుపై అవగాహన కల్పించారు. రైతులు మెలకువలను తెలుసుకుని పంటలను సాగుచేస్తే లాభాలు గడించవచ్చని తెలిపారు. ఈక్రాప్ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. ఈక్రాప్ చేసుకుంటే ప్రకృతి విపత్తులతో పంటలు నష్టపోతే పరిహారం అందుతుందని తెలిపారు. సర్పంచ్‌లు రాంబాబు, వెంకటేశ్వర్లు, వీఏఏ సుజాత, కౌసల్య, రైతులు పాల్గొన్నారు.


డిసెంబర్ 15లోగా పంట బీమా చేసుకోవాలి

వరికుంటపాడు : మండలంలోని విరువూరు, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ రవికుమార్ పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. డిసెంబర్ 15లోగా రైతులు స్వచ్ఛందంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంట బీమా చేసుకుంటే ప్రకృతి విపత్తులతో నష్టపోతే పరిహారం అందుతుందని తెలిపారు. ఆయన వెంట వీఏఏలు ఉన్నారు.


సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి, కొత్తపల్లి రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఓ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రబీ పంట సాగుచేసే రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. కిలో వరి విత్తనాలకు పది గ్రాముల వంతున సుడోమోనాస్ కలిపి శుద్ధి చేసుకుంటే తెగుళ్లు దరిచేరవని తెలిపారు. నారు పెరికే వారం రోజుల ముందు నారుమడిలో సెంటుకు 160 గ్రాములు చొప్పున కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలు వేసుకుంటే నాట్లు వేసిన తరువాత 20 రోజుల వరకు కాండం తొలుచు పురుగు ఆశించదని వివరించారు.

అనుమసముద్రంపేట: మండలంలోని కొండమీద కొండూరు, కుప్పూరుపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ టీ రజని పచ్చిశనగ పంట సాగులో విత్తనశుద్ధి, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అంతర పంటలుగా ధనియాలు, ఆవాలు, ఎర్ర బంతి, రక్షణ పంటలుగా జొన్న సాగు చేసుకోవడం వల్ల శనగపచ్చ పురుగులను అరికట్టవచ్చునని తెలిపారు. రబీ సాగులో కేఎన్ఎం–1638, ఆర్ఎన్ఆర్–15048 వరి రకాలు అనువైనవని, నవంబర్ 15 నుంచి నార్లు పోసుకోవాలని సూచించారు. ఏపీసీఎన్ఎఫ్ వెంకట లక్ష్మి, మండల ఇన్‌చార్జి సుబ్బరాయుడు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వీఏఏ ఏ సాయినాథ్ పాల్గొన్నారు.

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి, నందవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ ఎస్ రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డీసీపల్లిలో పొగాకు నాట్లు, నందవరంలో మినుము పైరును పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. పొదలకూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త వీ సురేఖాదేవి మినుము పంట సాగులో విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. కిలో విత్తనాలకు 2.5 గ్రాములు మాంకోజెబ్, 5 మి.లీ.ల ఇమిడాక్లోప్రిడ్ లేదా థయామిథాక్సమ్‌ను కలిపి శుద్ధి చేసుకోవాలని సూచించారు. మినుము పంటలో ఆకు ముడత తెగులు, పొగాకు లద్దె పురుగు, తెల్లదోమను గుర్తించినట్లు తెలిపారు. ఆకుముడతకు 5 మి.లీ.వేపనూనెను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పొగాకు లద్దె పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తెల్లదోమ నివారణకు పసుపు రంగు జిగురు అట్టలను ఎకరాకు 15 చొప్పున పెట్టాలని తెలిపారు. అసిటా మాప్రిడ్ 0.2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏఈఓ వెంకటేశ్వర్లు, వీఏఏలు సుష్మ, కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.



వరికుంటపాడు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రవికుమార్



చేజర్ల మండలం వావిలేరులో మినుము పంటను పరిశీలిస్తున్న ఏడీఏ